# నమస్తే తెలంగాణ

## ఆదిలాబాద్-నిర్మల్

5 | నిజామాబాద్ సోమవారం 22 ఏప్రిల్ 2024 | ADILABAD NIRMAL




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

## రుణమాఫీ కాకుంటే.. రేవంత్ రాజీనామా చేయ్..

- ఆదిలాబాద్ సభలో ప్రకటించాలి..
- హామీలు అమలు చేయని కాంగ్రెస్
- ఏ ముఖం పెట్టుకుని వస్తున్నారు..
- మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్, ఏప్రిల్ 21(నమస్తే తెలంగాణ) : ఆగస్టు 15న రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి ఆయన చెప్పిన గడువులోగా రైతులకు బ్యాంకు రుణాలు రద్దు కాకపోతే తాను రాజీనామా చేస్తానని ఆదిలాబాద్ పర్యటనలో స్పష్టం చేయాలని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న డిమాండ్ చేశారు. ఆదివారం బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం రేవంత్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సోనియాగాంధీ పుట్టినరోజు డిసెంబరు 9న రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని మాట తప్పారని గుర్తు చేశారు. ఇప్పుడు మరోసారి రైతులను మోసం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. సీఎం హోదాలో ఇప్పటికే రెండు సార్లు ఆదిలాబాద్ పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి జిల్లా అభివృద్ధి, ప్రజల సమస్యలను విస్మరించారన్నారు. ఏ ముఖం పెట్టుకుని మూడోసారి జిల్లాకు వస్తున్నారని ప్రశ్నించారు. ఇంద్రవెల్లి కాల్పులు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగాయని, అమాయక గిరిజనులు కాల్చిచంపిన కాంగ్రెస్ నాయకులకు అమరవీరులకు నివాళులు అర్పించే హక్కులేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు, నిర్బంధాలు పెట్టి స్తూపానికి నివాళులు అర్పించే అవకాశం లేకపోయేదని, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత నిర్బంధాలను తొలిగించామన్నారు.

### ఆటకెక్కిన ఆరు గ్యారెంటీలు

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తామని చెప్పిన ఆరు గ్యారెంటీలు ఆటకెక్కాయని జోగు రామన్న అన్నారు. 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగదారులకు జీరో బిల్లులు, రూ.500 సిలిండర్ అమలు చేస్తున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్నా పేదలకు ఆ పథకాలు అందడం లేదన్నారు. రైతు భరోసా పథకంలో భాగంగా రైతులకు, కౌలు రైతులకు రూ.15వేలు, కూలీలకు రూ.12 వేలు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. 32 వేల ఉద్యోగాలు ఇచ్చామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అంటున్నారని, ఆ ఉద్యోగాలు బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన నోటిఫికేషన్లకు సంబంధించినవి గుర్తు చేశారు. హామీలు నేరవేర్చని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ప్రజలు నిలదీయాలన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ గళం, ఇక్కడి సమస్యలను ప్రసావించే దమ్ము, ధైర్యం బీజేపీ, కాంగ్రెస్ నాయకులకు లేదని, బీఆర్‌ఎస్ ఎంపీలు మాత్రమే తెలంగాణ గళం వినిపిస్తారన్నారు. ఆదిలాబాద్ ఎంపీగా బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కుని గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో ఆదిలాబాద్ రూరల్ ఎంపీపీ గండ్రత్ రమేశ్, బీఆర్‌ఎస్ నాయకులు విజ్జిగిరి నారాయణ, సెవ్వ జగదీశ్, నర్సింగ్, సంజయ్, భూమన్న, స్వాగత్‌లు ఉన్నారు.

## భేష్ సందీప్

**దుబాయ్ వరదల్లో చిక్కుకున్న వారిని కాపాడుతున్న నిర్మల్ వాసి**

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 21 : నిర్మల్ పట్టణం బంగల్‌పేట్ కాలనీకి చెందిన పాతర్ల సందీప్ బతుకు దెరువు కోసం దుబాయ్‌కి వెళ్లాడు. డిప్‌వన్ గ్రీన్ కమ్యూనిటీలో లైఫ్ గార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. నాలుగైదు రోజులగా దుబాయ్ దేశంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వరదల్లో చిక్కుకున్న వారిని సందీప్ పడవ సహాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నాడు. సందీప్‌ను పలువురు అభినందిస్తున్నారు.



వరదల్లో చిక్కుకున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న సందీప్

## ఆదిలాబాద్ జిల్లాలో సీఎం పర్యటన

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నామినేషన్‌కు హాజరు
- ప్రచార సభలో పాల్గొననున్న ముఖ్యమంత్రి

ఆదిలాబాద్, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేడు(సోమవారం) ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 9.45 గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 11 గంటలకు ఆదిలాబాద్ చేరుకుంటారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ నామినేషన్ సందర్భంగా నిర్వహించే ర్యాలీతోపాటు కలెక్టర్ కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారికి సమర్పించే నామినేషన్ ప్రక్రియలో ఆయన పాల్గొంటారు. అనంతరం పట్టణంలోని డైట్ కళాశాల మైదానంలో నిర్వహించే ప్రచార సభకు హాజరై ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 12.30 గంటలకు ఆదిలాబాద్ నుంచి హెలికాప్టర్‌లో నిజామాబాద్‌కు బయలుదేరుతారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. పలు రోడ్లను మూసి వేయడంతోపాటు ట్రాఫిక్‌ను మళ్లించనున్నారు.

## రేవంత్ అన్న కలిసే అవకాశం ఇవ్వండి..

- ప్రధానిని 150 మంది కలిశారు..
- కాంగ్రెస్ నాయకుని పోస్ట్ వైరల్

ఆదిలాబాద్, ఏప్రిల్ 21(నమస్తే తెలంగాణ) : నేడు(సోమవారం) ఆదిలాబాద్ పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ ప్రధాన నాయకులు, కార్యకర్తలను కలిసే అవకాశం ఇవ్వాలని ఆదిలాబాద్‌కు చెందిన ఓ కాంగ్రెస్ నాయకుడు చేసిన పోస్ట్, గతంలో ఆయనను పోలీసులు అరెస్ట్ చేసిన పాత వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆదిలాబాద్ పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గుడిపల్లి నగేశ్ సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టారు. ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీని 150 మంది బీజేపీ కార్యకర్తలు కలిశారని, కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలను కలిసి అవకాశం సీఎం రేవంత్‌రెడ్డి కూడా కల్పించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీలో నాయకులు, కార్యకర్తలకు గుర్తింపు లేదని కాంగ్రెస్ నాయకుని పోస్ట్ ద్వారా స్పష్టమవుతుందని పలువురు చర్చించుకున్నారు. జిల్లాలో కొన్ని రోజులుగా కాంగ్రెస్‌లోతీవ్రమైన అంతర్గత విబేధాలు చోటు చేసుకున్నాయి.జిల్లాకు చెందిన ఓ నాయకుడు, సీనియర్‌లు, కార్యకర్తలను పట్టించుకోవడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.




కాంగ్రెస్ నాయకుడు సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్

## టీఎస్ఆర్‌జేసీ ప్రశాంతం

**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా 4,437 మంది హాజరు**



గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఎదులాపురం, ఏప్రిల్ 21 : తెలంగాణ రాష్ట్ర రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల(టీఎస్ఆర్‌జేసీ) 2024-25లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కొనసాగింది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో 23 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. 5,506 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. 4,437 మంది పరీక్ష రాశారు. 1,069 మంది గైర్హాజరయ్యారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రెండు టీఎస్ఆర్‌జేసీ కళాశాలలు ఉన్నాయని తెలిపారు. ఇందులో నిర్మల్(బాలికల) 88 సీట్లు, బెల్లంపల్లిలో(బాలురు) 88 సీట్లు ఉన్నాయి. బైపీసీ, ఎంపీసీ, ఎంఈసీ కోర్సుల్లో ప్రవేశానికి విద్యార్థులు పోటీ పడగా.. ఎంఈసీలో ఉత్తీర్ణత సాధించిన వారికి వరంగల్ జిల్లాలోని కళాశాలల్లో సీట్లు కేటాయిస్తారు. త్వరలో పరీక్ష ఫలితాలు వెల్లడించి, అర్హులైన వారికి సీట్లు కేటాయిస్తామని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కో- ఆర్డినేటర్ గంగాశంకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా కేంద్రంలోని పలు కేంద్రాలను పరిశీలించారు.

## చిరుతపులి దాడిలో లేగదూడ మృతి

తానూర్, ఏప్రిల్ 21 : బెంబర్ గ్రామంలో చిరుతపులి దాడి చేయడంతో లేగదూడ మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన షేక్ మౌలామియ్యా తన వ్యవసాయ క్షేత్రంలో శనివారం రాత్రి ఆవు, లేగదూడను కట్టేశాడు. చిరుత దాడి చేసి లేగదూడను హతమార్చింది. ఈ నెల 12న ఇదే గ్రామానికి చెందిన లచ్చన్న అనే రైతు లేగదూడపై చిరుత దాడి చేసి హతమార్చింది. వరుస ఘటనలు చోటు చేసుకోవడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. వరుస ఘటనలు జరుగుతున్న అటవీ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# కిలో ధాన్యం కొనలే..

**కేంద్రాల్లోనే ధాన్యం.. రైతు కండ్లలో దైన్యం..**

- కేంద్రాలు ప్రారంభించి 20 రోజులు దాటినా అధికారుల నిర్లక్ష్యం
- వాతావరణ మార్పులతో ఆందోళన చెందుతున్న రైతన్నలు
- కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం వీడకపోతే భారీ నష్టం
- ధాన్యం కొనుగోలు చేయకపోతే ఆందోళనలు చేస్తామని రైతుల హెచ్చరిక

*యాసంగి ధాన్యం కొనుగోళ్లపై అధికారులు, కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం చేయడంతో ఆరుగాలం పండించిన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వాతావరణంలో మార్పులతో అప్రమత్తంగా ఉండాల్సిన అధికార యంత్రాంగం ఇందుకు పూర్తి భిన్నంగా వ్యవహరిస్తున్నది. ఈ యాసంగిలో నిర్మల్ జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభం అయినప్పటికీ మారుమూల కేంద్రాల్లో అధికారులు నిబంధనలు పాటించడం లేదు. ఇందుకు నిదర్శనంగా ఖానాపూర్ పీఏసీఎస్ కొనుగోలు కేంద్రం నిలుస్తున్నది. వారం రోజులుగా వరికోతలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ధాన్యం ఆరబోసేందుకు కర్షకులు కొనుగోలు కేంద్రానికి తీసుకురాగా అధికారులు మాత్రం రైతులకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. ఈదురుగాలులు, వాన జల్లులతో తమకు భారీ నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని చెబుతున్నా.. పట్టించుకోవడ లేదు. ఇప్పటివరకు ఒక కిలో ధాన్యాన్ని కూడా కొనలేదని.. అధికారులు, ప్రభుత్వం రైతులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఆందోళనలు తప్పవని హెచ్చరిస్తున్నారు.*



ఖానాపూర్‌లోని కొనుగోలు కేంద్రంలో రైతులు ఆరబోసిన వరి ధాన్యం

ఖానాపూర్, ఏప్రిల్ 21 : రెండు రోజులుగా వాతావరణంలో మార్పులు రైతులను భయాందోళనకు గురి చేస్తున్నాయి. ఈదురు గాలులు, చిరు జల్లులు కురవడంతో ధాన్యం తడిసి ముద్దవుతున్నది. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావడంతో అధికారులు కొనుగోలు విషయంలో అలసత్వం వహిస్తున్నారు. కేంద్రం నిర్వాహకులు ధాన్యాన్ని ఆరబెట్టుకుని కేంద్రాలకు తీసుకురావాలని రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినప్పటికి కనీస వసతులు కల్పించకపోవడంతో రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రిపూట కరెంట్ లేక పందుల బెడద తీవ్రంగా ఉంటుందని అంటున్నారు. కేంద్రంలో తాగునీరు, వాచ్‌మన్, తేమ శాతం చూసే వారు కరువయ్యారని మండిపడుతున్నారు.

### ధాన్యం కొనుగోలు చేసేది ఎప్పుడో..

ఖానాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి కూతపెట్టు దూరం లో వ్యవసాయ మార్కెట్ ఉంది. ఏప్రిల్ 1న వ్యవసాయశాఖ అధికారులు పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. దీంతో మండలంలోని ఖానాపూర్, తర్లపాడు, పాత తర్లపాడు, ఎక్బాపూర్ గ్రామాల రైతులు భారీగా ధాన్యం తీసుకొచ్చారు. కానీ.. ఇప్పటి వరకు నిర్వాహకులు కిలో ధాన్యం కూడా తూకం వేయలేదు. తేమ శాతం పేరిట ధాన్యం కొనకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షాలకు ధాన్యాన్ని కాపాడుకునేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇప్పటి వరకు గన్నీ సంచులు కొనుగోలు కేంద్రానికి రాకపోవడంతో రాష్ట్ర సర్కారు, అధికారులపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సెంటర్ నిర్వాహకులు ధాన్యం అకాల వర్షం కారణంగా తడిస్తే మాకు సంబంధం లేదని, రైతులు తమకు పేపరుపై సంతకాలు పెట్టి ఇవ్వాలని సూచించడంతో ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులకు రైతులందరం ఫిర్యాదు చేస్తామని హెచ్చరించడంతో విషయం సద్దుమణిగింది. ఇప్పటికైన పాలకులు, జిల్లా అధికారులు స్పందించి కేంద్రంలో పేరుకుపోయిన ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

### 20 రోజులు గడుస్తున్నా..

నియోజకవర్గంలోని ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాల్లో 36 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో పీఏసీఎస్, ఐకేపీ, డీసీఎంఎస్, జీసీసీ ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. ఏర్పాటు చేసి 20 రోజులు గడుస్తున్నా.. కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడం గమనార్హం. పలు మండలాల్లో కోతలు ప్రారంభించి, ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకెళ్తున్నారు. ఈ నాలుగు మండలాల్లో ప్రస్తుతం రైతులు 25 వేల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేశారు. బీఆర్ఎస్ సర్కారు హాయంలో 33 వేల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగైంది.

### ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించలేదు..



ఐదు రోజుల క్రితం వరి కోసి ధాన్యాన్ని ఖానాపూర్ కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చా. ఇక్కడ కేంద్రం నిర్వాహకులు లేక రైతులందరం ఇబ్బందులకు గురవుతున్నాం. తేమ చూసే వారు కూడా లేరు. ధాన్యం ఆరబోసి అమ్ముకునేందుకు అరిగోస పడాల్సి వస్తుంది. రాత్రి పందుల బెడద, పగలు కోతుల బెడద విపరీతంగా ఉండడంతో కాపలా కాస్తున్నాం. ఈదురుగాలులు, వానలకు ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు టార్పాలిన్‌లు ఇస్తలేరు. తాలు, తప్ప పేరిట రైతులను ఆగం చేయకుండా కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేయాలి.

*- రామిడి మహేశ్, రైతు, తర్లపాడు.*

### తేమ 17 శాతం వస్తే ధాన్యం కొనుగోలు చేస్తాం..



ఖానాపూర్ కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యం తేమ శాతం పరిశీలించి కొనుగోలు చేస్తాం. మిల్లర్ల నుంచి ఇంక అలాట్‌మెంట్ రాకపోవడంతో కొనుగోళ్లు ప్రారంభించలేకపోయాం. హమాలీల కొరత కూడా ఉంది. ఇతర ప్రాంతాల నుంచి తీసుకురావడానికి కృషి చేస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ధాన్యం కొనుగోలు చేస్తాం. రైతుల ఆందోళన చెందకుండా సమన్వయం పాటించాలి. రెండు రోజుల్లో రైతులకు కనీస సదుపాయాలను కల్పిస్తాం.

*- భూమి ఆశన్న, ఖానాపూర్ పీఏసీఎస్ సీఈవో.*



ఖానాపూర్ : బీఆర్ఎస్ ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్



సోన్ : ప్రచార రథాలకు పూజలు చేసి ప్రారంభిస్తున్న జడ్పీ ఛైర్‌పర్సన్ విజయలక్ష్మి

# గెలుపు గులాబీదే..

- ప్రచార రథాలను ప్రారంభించిన బీఆర్ఎస్
- అట్టహాసంగా అంకురార్పణ చేసిన జడ్పీ చైర్మన్ విజయలక్ష్మి

సోన్, ఏప్రిల్ 21 : బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని నిర్మల్ జడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి అన్నారు. ఆదివారం నిర్మల్ మండలంలోని కొండాపూర్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ప్రచార రథాలకు పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేసీఆర్ గత పదేళ్లలో ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకొచ్చి ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయడం జరిగిందని, అవి ప్రజల్లో ఇప్పుడు గుర్తు చేసుకుంటున్నారన్నారు. ప్రతి గ్రామంలోకి వెళ్లి కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించి బీఆర్ఎస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎఫ్‌ఏసీఎస్ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు రాము, మామడ బీఆర్ఎస్ మండలాధ్యక్షులు చంద్రశేఖర్‌గౌడ్, నాయకుడు ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

### ఖానాపూర్‌లో జాన్సన్ నాయక్..

ఖానాపూర్, ఏప్రిల్ 21 : రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రచార రథాలను నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ ప్రారంభించారు. ఆదివారం పట్టణంలోని బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయం వద్ద జెండా ఊపి ప్రచార రథాలను ఖానాపూర్, పెంబి, కడెం, దస్తురాబాద్ మండలాలకు పంపారు. ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజు, మహేందర్, ప్రదీప్, దివాకర్, మణికంఠ, మహిపాల్, ప్రణీత్, మనోజ్ ఉన్నారు.

### దస్తురాబాద్‌లో..

దస్తురాబాద్, ఏప్రిల్ 21 : మండల కేంద్రంలో ఆదివారం బీఆర్ఎస్ ప్రచార రథాలను ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు బుడికే ఐలయ్య, నాయకులు ప్రారంభించారు. కారు గుర్తుకు ఓటు వేసి ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. వైస్ ఎంపీపీ రాజునాయక్, మహిళ అధ్యక్షురాలు విజయలక్ష్మి, నాయకులు మాణిక్‌రావు, సురేశ్ పాల్గొన్నారు.

### ఇంటింటా ప్రచారం

బోథ్, ఏప్రిల్ 21 : ఆదివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదేశాల మేరకు కన్గుట్ట గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. కారు గుర్తుకు ఓటు వేసి ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ నారాయణరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ రుక్మణ్ సింగ్, తాజా మాజీ సర్పంచ్ సురేంద్ యాదవ్, సొసైటీ డైరెక్టర్ నారాయణ, బీసీ సెల్ అధ్యక్షుడు బుచ్చన్న, నరేందర్, సత్యనారాయణ, సోనాల వీడీసీ అధ్యక్షుడు మునేశ్వర్ సోమన్న పాల్గొన్నారు.



బోథ్ : మాట్లాడుతున్న మండల కన్వీనర్ నారాయణరెడ్డి



దస్తురాబాద్ : ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## మే 13న ఓటరు పండుగలా నిర్వహించాలి..

- నేరడిగొండ(జీ)లో వంద శాతం పోలింగ్ జరగాలి
- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఇచ్చోడ(సిరికొండ), ఏప్రిల్ 21 : మే 13వ తేదీన జరిగే పోలింగ్‌ను ఓటరు పండుగలా నిర్వహించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఆదివారం సిరికొండ మండలంలోని నేరడిగొండ(జీ) గ్రామంలో కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మంగళహారతులు, మేళతాళాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల ఫేస్ ఫోర్ మే 13న పోలింగ్ సందర్భంగా గ్రామస్తులు ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. జిల్లాలో స్వీప్ కార్యక్రమాలు నిర్వహిస్తామని, స్వీప్ ప్రచార రథాన్ని గ్రామాల్లో తిప్పుతూ ఓటుపై అవగాహన కల్పించాలన్నారు. ప్రజలు ఓటును వినియోగించుకునే విధంగా ప్రత్యేకాధికారులు అవగాహన కల్పించాలన్నారు. దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు, వయోవృద్ధులు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఓటు వేయడంతోపాటు ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు ఓటు వేసే విధంగా చైతన్యం పరచాలని అన్నారు. ఈనెల 25వ తేదీ నుంచి మే 5వ తేదీ వరకు ఓటరు స్లిప్పులు పంచుతామని తెలిపారు. పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందన్నారు. అనంతరం పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. తాగునీరు, చైర్స్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. 85 ఏండ్లు దాటిన వృద్ధులు, 45 శాతం కంటే ఎక్కువ వికలత్వం ఉండి పోలింగ్ కేంద్రానికి రాలేని స్థితిలో ఉన్న వారికి మాత్రమే హోం ఓటింగ్ సదుపాయాన్ని కల్పించామన్నారు. వీల్ చైర్ల ఏర్పాటు, ర్యాంపులు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, తహసీల్దార్ విజయ్ కుమార్, ప్రత్యేకాధికారి, ఆర్ అండ్ బీ నర్సయ్య, ఐకేపీ ఏపీఎం ఎంపీవో సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.




కలెక్టర్ రాజర్షి షాకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

## కేజీబీవీలో చెత్త తొలగింపు

నర్సాపూర్(జి), ఏప్రిల్ 21 : విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ కావడంతో కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని శనివారం కలెక్టర్ సందర్శించారు. స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి వీణలకు పలు సూచనలు చేశారు. ఆయన ఆదేశాల మేరకు ఆదివారం మిషన్ భగీరథ ట్యాంకు వద్ద ముళ్ల పొదలు, రోడ్డు పక్కన ఉన్న చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రపరిచారు. ప్రధాన రోడ్డులో గల వ్యాపార సముదాయాల వద్ద కూడా చెత్తను తొలగించి శుభ్రపరిచారు.



చెత్తను తొలగిస్తున్న సిబ్బంది